


శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

# శ్రమతో సేవ – సేవతో కైవల్యం మాసపత్రిక


వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్

ఎడిటర్: గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

**నేపథ్యం: ఆలోచనలు అరికట్టడమే సాధన**

సంపుటి: 02 సంచిక : 3

24-September-2018


శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన “శ్రమతో సేవ – సేవతో కైవల్యం” ను అనుసరించి మా జన్మలు ధన్యము గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి వాదా బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

**గమనిక** : ఎవరైనా ఈ e-magazine లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

**శ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం**

https://drive.google.com/file/d/1CBPz6jel_jsqvIBy9xvEePfhvXQdW9DV/view?usp=sharing

ఆలోచనలకు మూలమే మా సార్ ఈ సత్ సంగం లో చర్చిస్తారు.

https://drive.google.com/file/d/1i2bNczTjcBJLHbYefRAmM4sw13vQLEPg/view?usp=sharing

ఆలోచనలకు మందు ఏమిటో ఈ సత్ సంగం లో సార్ పరంగా వివరిస్తారు. మాస్టారు సూచించిన మార్గము అనుసరించి తరచి చూచుకొని ఆలోచనలకు మూలమైన కర్తృత్వ భావాన్ని ఎలా గుర్తించి తొలగించుకోవాలో ఎన్నో ఉదాహరణలతో ఆలోచింప చేస్తారు.

**అనసూయా అత్రి సంభుతో దత్తాత్రేయో మహాత్మనః సర్వ దేవాధి దేవస్త్వం మమ చిత్తం స్థిరీ కురు.**

ఓం

## వర్తమానంలో మన ఆలోచనలు ఉంటాయా ? ఆలోచనలు మనం విడవ(లే)క పోవుటకు కారణం ఏమిటి ?

ఆలోచనలు అరికట్టడమే సాధన, ఆలోచనలు అహంకారానికి గుర్తు. ఇవి శ్రీ మాస్టారు శ్రీ సుబ్బరామయ్య సార్ల ఉవాచ. శ్రీ మాస్టారి బోధామృతం లో మన ఆలోచనలు నిరంతరం జరిగిపోయిన వాని పైనో లేక జరుగబోయే వాని గూర్చో ఉంటాయని, కానీ చేసే పనిపై లేదా మన ప్రస్తుత ధర్మాచరణ పై మనసు ఆలోచనలు కేంద్రీకృతమై ఉండడం “Live in the present moment” అనేది అభ్యసించటం ముఖ్యమని శ్రీ మాస్టారు మాటగా సారు చెబుతారు. అయితే మన ఆలోచనలు నిరంతరం ప్రవాహంలా, చేసే పనిపై కూడా నిలువక, విరామమే ఇవ్వకపోవటానికి కారణం శ్రీ మాస్టారు “ఆ పనులన్నీ మనం చేస్తేనే అవుతున్నాయని, మనమే అన్నింటికీ కర్త అనే భావమే” అని చెబుతారు. అయితే చేసేది లేదా పని జరిగేది మన ద్వారానే అయినా సఫలం కావడం భగవంతుని నిర్ణయము పై ఆధారపడుతుంది అని చెప్పినా, భావం లో మనం అంగీకరించినట్లు ఉన్నా, మన ఆలోచనలు మాత్రం తగ్గకపోవడానికి, పలుచ బడక పోవడానికి కారణం ఏమిటి?

భగవంతుని లో మనము భాగం అయితే మనకంటూ ప్రత్యేకంగా ఆలోచించి చేయవలసిన అవసరం ఏముంది! కానీ మనకు ఆ అవగాహన కానీ అనుభవం కానీ ఎలా వస్తుంది? అసలు మనకు విరామ సమయంలోను, ముఖ్యమైన పనులు లేనప్పుడు సైతం ఆలోచన పరంపర తీవ్రత తగ్గకపోవటం, విడవలేక పోవటానికి కారణం ఏమిటి?

## ఆలోచనల వేగం తగ్గటం ఎందుకు ?

మనకు అఇష్టమైన సందర్భం కానీ, పరిస్థితి కానీ ఏర్పడినప్పుడు, అనుకున్న ప్రయత్నాలు చేయలేనప్పుడు, ప్రయత్నం చేసినా జరుగనప్పుడు, ఇంద్రియ చాపల్యానికి ఆరాట పడుతున్నప్పుడు, విస్తృతమైన మన ఆలోచనా పరంపరను చేధించేది ఎలా! ఆలోచనలు లేని (శుద్ధమైన) మనసులో అలలు లేని (తేట తెల్లమైన) నీటి అడుగు కాన వచ్చినట్లు తృప్తి, శాంతులు కలుగుతాయి అని శ్రీ మాస్టారు చెప్పినా, ఎందరో మహాత్ములు ఆ తృప్తి శాంతులు అనుభవించి, ఆ మార్గం జీవితాచరణాలతో జోడించి, బోధించి చేయూతగా మార్గదర్శకంగా నిలుస్తున్నా మనకు ఆ తృప్తి, శాంతులు అనుభవ అవుతున్నాయా ?

పనిచేసి ఉద్యోగము లేక ధనము లేక మరో కోరిన వస్తువు సాధించితే కలిగేది తృప్తి కాదని, మనలోనే తృప్తి శాంతులు ఉన్నాయని వానిని అనుభవింప చేసుకుని లేదా కనీసం గుర్తుతో మన విద్యుక్త ధర్మ నిర్వహణ, ధర్మాచరణ, పనులు మొదలైన జీవనం చేయాలని శ్రీ వివేకానందుడు మొదలైన వారు బోధించినా మనకు ఆ అనుభవం కాకపోవడానికి కారణమేమి? ఆ నిరామయ స్థితి అనుభవమై ఆలోచనల తీవ్రత తగ్గి, ఆరోగ్యంగా, సంతోషంగా, జీవించడానికి ఏమి చేయగలము ? ఏమి చేయవచ్చు ?

## మరి దానికి మార్గం ఏమిటి ?

అనేది శ్రీ భరద్వాజ మాస్టారి బోధ నుండి, శ్రీ సుబ్బరామయ్య సార్ ఆచరణ నుండి కొద్దిగా  స్మరించుకుందాము.

## ఉత్తమ సంస్కారము – నిష్కామ కర్మ:

శ్రీ భరద్వాజ మాష్టారు జ్ఞాన యోగ సర్వస్వం ముందుమాటలో "మాకు ధ్యానం కుదరటంలేదు, లేదా మనస్సు నిర్మలంగా ఉండటం లేదు, ఎంత అభ్యసించినా నిరాశే ఎదురు అవుతుంది" అన్న మన అనుభవానికి ప్రశ్నలకు "భూమి సారవంతం చేసుకోకుండా విత్తనాలు జల్లి పంట కై ఎదురు చూసేటట్లు" మన సంస్కారాలను, అలవాట్లను, జీవన విధానాన్ని, అవగాహనను సరిచేసుకోకుండా ధ్యానం, మనో నిశ్చలత కుదరదని, ఆలోచనా ప్రవాహం ఆగదని, తగ్గదని వివరిస్తారు. ఆలోచనలు అరికట్టే సాధనకు ఉత్తమ సంస్కారం మూలం అని అర్థం. ధ్యానాన్ని గజస్నానం చేయవద్దు అంటారు మాస్టారు. ధ్యానాన్ని గజస్నానం చేసేవి మన కుసంస్కారాలు, బలహీనతలే అని గుర్తించాలి. మనలోని సాటి వారిలోని బలహీనతలే మన మనసు భగవంతుని పై నిలపడానికి ప్రధాన అవరోధాలని శ్రీ మాస్టారు "శ్రీ సాయి లీలామృతం" లో (సత్సంగం చాప్టర్లో) చెబుతారు. దీనినే మల దోషం- రాగద్వేషాలు మొ || గా పేర్కొంటారు. దానిని నివారించు కోవటానికి నిష్కామ కర్మ సాధనగా చెబుతారు. ఉత్తమ సంస్కారాలు ఆర్జించుట నిష్కామ కర్మ ఒకదాని కొకటి సహకరిస్తూ జరుగుతాయని శ్రీ సార్ చిన్నప్పటి జీవిత సంఘటనలు ఆచరణ తెలుపుతాయి.

శ్రీ సార్ చిన్న వయసులో ఒక రోజు నిరాహారిగా ఉండి అయినా నెల్లూరులో హై స్కూల్ చదువులకై చేసిన ప్రయత్నం సార్ కు గల పట్టుదల తెలుపుతుంది. దేనిసైనా, ఉత్తమ కార్యాలు సాధించడంలో పట్టుదల ఎంతటి అవసరమైన సంస్కారమో గుర్తించాలి. శ్రీ సార్ నెల్లూరు హాస్టల్లో చేరి చదువు కునేటప్పుడు తోటి పిల్లలు అందరూ ఎంతో అశ్రద్ధతో, చిల్లర తిరుగుడు లలో గడిపినా సార్

శ్రద్ధగా చదివి (హాస్టల్లో సార్  ఒక్కరే) PUC (pre-university course) పాస్ అవుతారు. ఇచ్చట సార్ యొక్క కార్యదీక్ష గుర్తించవచ్చు. ఎందరో ఇబ్బందుల్లో ఉన్న వారిని చూచి, స్పందించడం చిన్నప్పట్నుండి సార్ కు గల మానవత్వమే కాక, ఏమీ ఆశించక సాయం చేయటం నిష్కామ కర్మను కూడా తెలుపుతుంది.

## సద్గురు సాంగత్యం – ధర్మాచరణ, నిష్కామ కర్మ:

ఇలాంటి ఉత్తమ సంస్కారాలు, నిష్కామ కర్మ పునాదిగా ఉండటం వల్లనే తగినంత పుణ్యం సమకూడి, సమయానుకూలంగా శ్రీ భరద్వాజ మాస్టర్ వంటి సద్గురువు  సన్నిధి, సేవల పై  ఆకర్షణ, శ్రద్ధ కలిగాయి.


శ్రీ మాస్టారు ప్రవచనాలలో నామస్మరణ చేస్తూ ఉంటే సరిపోతుందా అని అడిగి  "శ్రీ రంగన్న బాబు గారు రామ నామస్మరణ మూడు గంటలు చేసి ఆత్మ సాక్షాత్కారము పొందారు. రామ నామమే సాధనగా చేశారు కదా! మనం అలానే చేయవచ్చు కదా!" అని అడుగుతారు. ఎప్పుడు సరి పోతుందో వివరిస్తూ:  శ్రీ రంగన్న బాబు గారిని ఒక సేవకుడు తనకు కలిసి వచ్చిందని ఎంతో ఆరాధించి తన ఇంట్లో ఉంచుకుంటాడు. శ్రీ రంగన్న బాబుగారి కోసం జనం ఎక్కువ  వస్తున్నారని విసుగు చెంది వారిని ఒకరోజు నానా మాటలు తిడతారు. రంగన్న బాబు గారు ఏమీ అనక "వాళ్లను రాకుండా చేయమంటారా?" అని అడిగి ఆ ఇల్లు వదిలి నిర్వికారంగా (రామ స్మరణలో) వెళ్ళిపోతారు. ఆ సేవకుని కి కలిసి వచ్చిన దంతా  కోల్పోయి కష్టాలపాలై మరల శ్రీ రంగన్న బాబుగారిని ప్రార్థిస్తాడు" వారి ఇంటికి రమ్మని!  "సరే బాబు పద !" అని తిరిగి వస్తారు. కాని ఒక్క మాట అనరు. శ్రీ మాస్టారు ఈ సంఘటన చెప్పి అదే మనకైతే ఎంత నామస్మరణ చేసినా, చేస్తున్నా వెళ్ళమని చెప్పక, సందు తిరిగేటప్పటికి "వీడు నా వల్ల ఇంత మేలు పొంది నన్ను ఇలా అంటాడా!" అన్న భావం, కోపం వస్తుంది. ఉత్తమ సంస్కారం, సత్వగుణం సాధించిన వారికి నామస్మరణ అయినా సరిపోతుంది కానీ అవి సాధించడానికి అవగాహన, అవగాహనతో కూడిన విశేష ప్రయత్నం ముఖ్యమని శ్రీ మాస్టారు చెబుతారు.

శ్రీ సార్ కూడా వారి ఉత్తమ సంస్కారానికి తోడు శ్రీ మాస్టారి సన్నిధిలో ఏదో ఒక సేవ గుర్తించి చేస్తుండే వారు. అంతేకానీ మనసు (నేల) సరిచేసుకోకుండా ధ్యానమే ప్రధానమని కూర్చునేవారు కాదు. నిష్కామ కర్మ గా మందిర నిర్మాణము, మాస్టారి వద్దకు, ఫంక్షన్స్ కు, ఇతరత్రా వచ్చే భక్తులకు భోజనం వండి పెట్టడం, మందిర నిధుల సేకరణ కు బిక్ష ఇలా సేవ చేసేవారు. సత్వగుణాన్ని మరింత ద్విగుణీకృతం చేసే గురు భక్తుల సేవలో గడిపేవారు.

## ఉపాసన – సాధన – గురువాక్య పాలన :

శ్రీ మాస్టారు సార్ కు కాలాన్ని ఇమ్మని సూచన ఇవ్వగానే ఉదయం 6:00 నుండి 9:00 భగవంతుని పూజ ధ్యానం పారాయణలకు కేటాయించేవారు. అప్పుడు ధ్యానం కుదరడం లేదని మాస్టారికి చెబితే డైరీ పెట్టుకొని ధ్యాన సమయంలో తనకు వచ్చే ఆలోచనలు వ్రాసి పెట్టుకుని వానిని వివేక విచారాల తో నిర్మూలించుకో మంటారు. శ్రీ సార్ కు వాళ్ళ అమ్మగారు తిప్పే వడ్డీల గూర్చి, బర్రెల పెంపకం మరియు శ్రీ సార్ స్కూల్లో ఇతర టీచర్స్ తో జరిగే అనవసర సంభాషణలు ఆలోచనలుగా తరచు


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

వస్తున్నాయని గుర్తించి చెబుతారు. ఈ ఆలోచనల గూర్చి శ్రీ మాస్టారికి తెలిపితే మాస్టారు ధ్యానం నిజంగా కుదరాలంటే Major ఆలోచనలు కు సంభందించి చేసే పనులు అవసరమైన వా ? కావా ? నిష్పక్షపాతంగా వివేచించి వదులుకో మంటారు. వడ్డీలు తిప్పడం మాని, బర్రెలు అమ్మి వేస్తారు. అవి వెంటనే విడిచినా స్కూల్లో మాటలు వినకుండుట కుదరకుంటే ఎంతో శ్రమకోర్చి సాధిస్తారు. శ్రీ సార్ కూడా కాలాంతరములో శ్రీ మాస్టారి మాట "గురువు చెప్పినట్లు చేయవలసింది మనమే అని, శ్రద్ధగా చేస్తుంటే తప్పొప్పులు చెప్పి భగవంతుడు చూచి సరి చేస్తారని చెబుతారు."

ధ్యానం సాధించాలనో, ఆలోచనల వెనకున్న తృప్తి శాంతులు పొందాలనో, నిజమైన తపన, శ్రద్ధ ఉంటే ఎంతటి త్యాగానికైనా ఎలా సిద్ధమవటం సాధ్యమో గుర్తించాలి.

శ్రీ మాస్టారు "మనలోని బలహీనతలు మహాత్ముల సన్నిధిలో ఉన్నంత మాత్రాన రాలిపోతాయి" అన్న వాక్యం ఆచరణలో కూడా శ్రీ సార్ ఎంతటి శ్రద్ధ చూపారో శ్రీ వెంకయ్య స్వామి వారు శ్రీ సార్ కు గొలగమూడి నివాసం ప్రసాదించి నిరంతరం తన సాంగత్యం ప్రసాదించడంలో తెలుస్తుంది. సాధనలో నిజమైన తపన ఎలా ఉండాలో శ్రీ సార్ వహించిన నియమ పాలన, స్వామి సందేశం అనుసరించి గొలగమూడి స్వామి సన్నిధ లో నిద్ర, నివాసం, స్వామి సాంగత్యం కై పడిన శారీరక శ్రమ, గొలగముడి నివాసము లో పడిన కష్టాలు మొదలైనవి అన్నీ తెలుపుతాయి.

విరామ సమయంలో మనసులో ఆలోచనలు లేకుండా భగవంతునిపై నిలుప లేకపోవడాన్ని విక్షేపదోషం అంటారు. ఉపాసన ద్వారా ఆ విక్షేప దోషం నివారించుకోవాలని శ్రీ సార్ వార్తాలాపం వివరిస్తూ చెబుతారు. అట్టి ఉపాసన, నిష్కామ కర్మ తో పాటు చేస్తుంటే క్రమంగా ఆలోచనలు పలుచబడి మార్గం లభ్యమవుతుందని సార్ ఆచరణ తెలుపుతుంది.

## కర్తృత్వభావం: మానవ యత్న మా – భగవత్ నిర్ణయమా ?

గొలగమూడి లో సార్ నిష్కామ కర్మ గా ఎన్నో నిర్మాణ కార్యాలు, సాయి మాస్టర్ సేవా ట్రస్టు ద్వారా సేవ, పుస్తక రచన చేపడుతూనే ఆ కార్యాలు అన్ని ఏ భావంతో చేసే వారో కూడా గుర్తించాలి. శ్రీ సార్ ఆరతుల సమయములో కాని, పూజ సమయములో కానీ తన ఆలోచనలు గుర్తిస్తూ ఆలోచనలు లేకుండా చేసే ప్రయత్నం ఎంతగా చేశారో అప్పుడప్పుడు సూచన ప్రాయంగా వివరిస్తూ ఉండేవారు. హారతి సమయంలో ఆ కార్యాలు గూర్చి సార్ కు వచ్చిన ఆలోచనలను వివరిస్తూ అవి మనం చేస్తున్నా మన్న భావం ఉంటేనే ఆలోచనా ప్రవాహం అని, ఆయన చేస్తున్నారు, చేయిస్తున్నారు అన్నవి గుర్తించాలి అని వివరించే వారు.

ఉదాహరణకు సమ్మేళనం అప్పుడు స్థల నిర్ణయం నుండి, అన్నాలు, నీళ్లు సున్నం వేయించటం మొదలైనవి అన్ని స్వామి, మాస్టారు ఎలా చేస్తున్నారు అన్నది అందరికి గుర్తింప చేశారు. తన ప్రమేయం లేనిదే ఆ ప్రదేశమంతా తిరుత్తల్లి నుంచి వచ్చిన భక్తుడు శుద్ధిచేయడం, మరో భక్తుడు సాయి మాస్టర్ నిలయం అంతా సున్నాలు ఒక్కపూటలో ఎలా వేయించాడు అన్నది గుర్తింపచేస్తూ ఆయన (మాస్టారి) హస్తం పని చేయటం వల్లనే కార్యం జరుగుతుందన్న గుర్తింపు తెస్తూ చెబుతారు.

మనం చేస్తేనే అవుతుంది అనే భావం deep rooted గా ఉండటమే ఆలోచనలకు మూలమని దానిని తెలుసుకొని తగ్గించుకోవడానికి పరిష్కారం శ్రీ సార్  మాష్టారి సంభాషణలలో (మాష్టారి భోధామృతం లో) ఉందని గుర్తించాలి. మాష్టారు ఎప్పుడు విరామంగా ఉన్నా సార్ "మానవ యత్నమా? దైవ నిర్ణయమా?" పని సఫలం కావడానికి మూలం అని అడిగేవారు. శ్రీ మాష్టారు "ఆలోచన అవసరం లేదు, మనం చేయవలసినట్లు ఉన్న పూర్వకర్మే నెట్టి చేయిస్తుంది." అని చెపుతారు. అది అవగతం కాకుంటే "నీ జీవిత సంఘటనలను వెనక్కి తిరిగి చూసుకో" ఆరంభం నీ సంకల్పమా! దైవ నిర్ణయమా అని చెబుతారు. దైవ దత్తం గా వచ్చిన వాటికి మనం చేసే ప్రయత్నం కూడా " మన ప్రయత్నం చేయవలసిన కర్మను నివారించు కొనుటకే" అన్నట్లు, "యత్న ఫలితాలు ప్రారబ్దమును అనుసరించి జరుగుతాయని" సుబ్బమాంబ గారి లెటర్లో చెబుతారు. రమణ మహర్షి వాక్కు గా "జరగవలసినవి ఎందరు అడ్డుకున్నా ఆగవు, కానివి ఎందరు ఎంత ప్రయత్నించినా లాభం లేదని జరగవు అని చెబుతారు".


అయితే మనము చేయవలసిన ధర్మాచరణకు సిద్ధమై చేస్తూ "అల్లా మాలిక్" అన్న భావం గుర్తుంచుకుని నడుచుకోవడమే (నిలుపుకోవడమే) అని చెప్పినా, నిలుపుకోవడం సాధ్యమా! దానికే సాధన అని గుర్తించాలి. శ్రీ సార్ ఆచరణ అంతా ఇది తెలుపుతుంది. శ్రీ సార్ స్వామి సేవలో ఆలోచనలు లేకుండా చిదుగు పుల్లలు ఏరటం, మరుపు వస్తే వెనక్కి వెళ్లి మరల స్మరణతో చేయడం మొదలైనవి అన్నీ సాధనలో ఉండవలసిన శ్రద్ధ, తీవ్రత తెలుపుతాయి. అంతేగాక సార్ ఆయాసం, ఆలోచనల తీవ్రత వల్లనే అని చెబుతూ, గురువు పై దృష్టి పెట్టి మనకు ఇచ్చే సందేశాన్ని గుర్తించి నడుచుకోవాలని హెచ్చరిస్తున్నారు.

## నిరామయత – తృప్తి, శాంతిలతో జీవించడం :

ఈ విధంగా అల్లా మాలిక్ భావం నిలుపుకోవడానికి, ధర్మ నిర్వహణకు, కర్మ నివారణకు, క్రీడ లాగా విశేష ప్రయత్నం, నిష్కామ కర్మ చేస్తూ విరామ సమయం అంతా ఆలోచనలకు మందు పెట్టే భగవంతుడిచ్చిన సందేశంతో అవకాశాలను వినియోగించుకునే వారికి సహజంగానే ఎలాంటి నిరామయత లభిస్తుందో ఎంతటి దివ్య అనుభవాలు, ఆధ్యాత్మిక స్థితి, తృప్తి శాంతులు కలుగుతాయో సార్ జీవిత సంఘటనలు, శాంతి తెలుపుతాయి. శ్రీ స్వామి సార్ పెరట్లోని నారదబ్బకాయిల చెట్టుకు గజనిమ్మ పండ్లు కాయించడం అనే దివ్యానుభవం గుర్తించి,  వారి సర్వ సమర్థతపట్ల ఎరుకతో ఆలోచనలు మాని నిశ్చింతగా ఉండు (గమ్మునగా కూర్చో), అన్నది స్వామి సందేశం అని చెబుతారు.

అలానే "మా ఆటపాటలతో మిమ్ము మెప్పించ వలనే కానీ మోక్ష మిమ్మని మిమ్ము అడగదగునా" అన్నట్లు జీవించిన సార్కు చివరి సంవత్సరంలో మంచం లో ఉండవలసి వచ్చినా వారి ముఖములో ప్రస్ఫుటంగా ఉండే శాంతి, ఎప్పుడు బాధపడక ఆ పరిస్థితి కి కూడా భగవంతుని పై అసంతృప్తి కనపరచక పోవటం వారి ధ్యాన స్థితికి నిదర్శనం. పైగా శారీరక కర్మానుభవం జరుగుతున్నా చెదరనిశాంతి తృప్తులతో జీవించడం, ఆ సమయములో కూడా ఎందరో భక్తులకు దివ్య అనుభవము ఇవ్వడము వారికే చెల్లింది. శ్రీ సారు చెప్పిన రీతి నిష్కామ కర్మ, ఉపాశనలు, అల్లా మాలిక్ భావంతో శ్రద్ధతో ఆచరించి గురుకృపతో ఆలోచన పరంపర నుండి బయట పడే మార్గం లో నడపమని ప్రార్థిద్దాం.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

## హైదరాబాద్ వెంకటేశ్వరరావు అనుభవాలు :

శ్రీ స్వామిని, సార్ ను ఆశ్రయించిన  వారిని ఎలా నిష్కామకర్మ చేయటం లో ప్రోత్సహించి అవకాశం కల్పించి నడిపించి వారి బాధ్యతలు, ఇబ్బందులలో ఎలా గురువుపై ఆధార పడేలా చేసి సులభం చేశారో, నిజమైన గురువు ఎలా లౌకిక బాధ్యతలు నిర్వహింప చేస్తూనే,  ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తారో మనం హైదరాబాద్ వెంకటేశ్వరరావు గారి క్రింది అనుభవాలలో చూడవచ్చు. గొలగమూడి దాటని శ్రీ సార్ వీరికి పుస్తకాలను ప్రింట్ చేసే సేవ అనుగ్రహించి సాధ్యమైనంత తక్కువ ధరకు అందరికి స్వామి పుస్తకాలు అందే అద్భుత సేవకు ప్రోత్సహించి ఆ పని చేయించి ఎన్ని విధాల అనుగ్రహించారో ఈ అనుభవాలలో చూడవచ్చు.   మనచే చేయించే ది సారే నని, అనుగ్రహించేది వారె నని గుర్తించాలి.

### సార్ తొ తొలి పరిచయాలు  :


వెంకటేశ్వరరావు  కాలికట్ (కేరళ) లో  M Tech  చదువుతున్నప్పుడు  రవి కుమార్ గారి ద్వారా  సాయిబాబా గురించి తెలిసి సత్ సంగాల లో పాల్గొనేవాడిని. ఆయన గైడెన్స్ వల్ల  గొలగమూడి  వెంకయ్య స్వామి దర్శనం అయింది.  1999 లో సుబ్బరామయ్య సార్ గారి దర్శనం మొదటిసారి అయింది. అప్పుడు సాయి మాస్టర్ నిలయం కనస్ట్రక్షన్ జరుగుతోంది. సార్ ని చూడగానే ఎంతో సాధారణంగా కనపడటమే కాకుండా చాలా బాగా మాట్లాడారు. సార్ తో మాట్లాడుతున్నప్పుడు అక్కడ దక్షిణ ఇద్దామనుకున్నాను. అక్కడ కార్పెంటర్ అడిగిన చిన్న చిన్న వస్తువులు కి సార్ డబ్బులు ఇస్తున్నారు. కాని నా దగ్గర డబ్బులు ఉన్నా నేను ఇవ్వలేదు. వెళ్లే ముందు దక్షిణ ఇచ్చి సార్ కి చెప్తే సార్ "నువ్వు ఎక్కడికి వెళ్ళినా దక్షిణ ఇస్తూ ఉండు నీ పనులు అవుతాయి" అని చెప్పారు.

### ఉద్యోగం :

మా నాన్నగారు నన్ను హాయిగా వ్యాపారం చేసుకోవచ్చు కదా అంటే నేను మూడు నెలలు ఉద్యోగ ప్రయత్నం చేస్తాను, రాకపోతే అప్పుడు వ్యాపారం చేస్తా అని చెప్పి నేను ప్రయత్నాలు చేశాను. నేను టీచర్ పోస్టింగ్ కి JNTU హైదరాబాద్, SV యూనివర్సిటీ, తిరుపతికి అప్లై చేశాను రెండు యూనివర్సిటీల నుంచి నాకు ఉద్యోగం వచ్చింది. ఏ ఉద్యోగంలో చేరాలో  సార్ ను అడిగితే సార్ " మొదట ఏ యూనివర్సిటీ నుంచి ఉద్యోగం వచ్చింది?" అని అడిగారు.  JNTU యూనివర్సిటీ నుంచి వచ్చింది అని చెప్తే సార్ దాంట్లో జాయిన్ అవమన్నారు.  జాయిన్ అయిన మూడు నెలల తర్వాత  వాసవి ఇన్స్టిట్యూట్ లో పర్మినెంట్ లెక్చరర్స్ కి ఉద్యోగాలు పడ్డాయి, "మీరు అప్లై చేయండి" అని ఒక సీనియర్  ఉద్యోగి చెప్తే నేను వెళ్లి వాసవి కాలేజీలో ఒక ప్రొఫెసర్ ను ఎలా చేస్తే నాకు ఉద్యోగం వస్తుందో మెలకువలు చెప్పమన్నాను. ఆయన నేను ఎవరో కూడా ప్రశ్నించకుండా ఎలా అప్లై చేయాలో, ప్రిపేర్ అవ్వాలో కూడా  చెప్పారు. నేను అలానే ఉద్యోగానికి అప్లై చేశాను. శాశ్వత ఉద్యోగం వచ్చింది.

1999 కార్తీకమాసం లో నాతో పాటు మా అమ్మ కూడా సార్ దర్శనానికి వచ్చారు.  మా అమ్మగారు  సార్ తో  మా నాన్నగారి అనారోగ్యం గురించి చెప్పి రక్షించ మన్నారు. సారు మా అమ్మతో  అమ్మ మొదట్లో ఇబ్బంది చేస్తుంది గాని తర్వాత అంతా బాగుంటుంది అని చెప్పారు.  నేను వాసవి కాలేజ్ లో ఉద్యోగం వచ్చిన తర్వాత join అవ్వక ముందు ఇంటికి వెళ్ళితే  మా


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

అమ్మ వాళ్ళు "నాన్నకు ఒంట్లో బాలేదు, హైదరాబాదుకు వస్తాము, అక్కడ డాక్టర్ కు చూపెడదాము" అని చెప్పారు. మేము NIMS లో జాయిన్ చేసాం. ఒక రకంగా చెప్పాలంటే మా నాన్నగారు చివరి స్టేజ్ లో ఉన్నారు. డాక్టర్లు ఎన్నో పరీక్షలు చేసినా మా నాన్నగారి రోగం అంతుపట్టలేదు. అందువలన వాళ్లకి ఏమీ పాలుపోలేదు. ఒక రోజు రాత్రి నాకు, మా అమ్మగారికి స్వప్నంలో శ్రీ శ్రీ శ్రీ వెంకయస్వామి వారు కనపడ్డారు. అదే రోజు రాత్రి మా నాన్నగారు బెడ్ మీద నుండి లేచి యూరినల్స్ కి నడిచి వెళ్లి వచ్చారు. అప్పటి నుండి ఆయన దాదాపు 17సం||లు ఆరోగ్యంగా జీవించారు.

## పుస్తక ప్రచురణ సేవ – సదవకాశం :

ఉద్యోగంలో జాయిన్ అయిన తర్వాత సార్ దగ్గరికి వస్తే సార్ 70 వేలు రు || ఇచ్చి వార్తాలాపం ప్రింట్ చేయించమన్నారు. నాకు ప్రింటింగ్ గురించి ఏమీ తెలియకపోయినా సార్ కు మాత్రం అడ్డు చెప్పలేదు. హైదరాబాద్ కు వెళ్ళిన తర్వాత సార్ సూచన ప్రకారం ఓం సాయి గ్రాఫిక్స్ లో ప్రింట్ చేయించాను. ఒక రకంగా చెప్పాలంటే శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారికి ఇష్టమైన వార్తాలాపం గ్రంథం ముద్రణలో లేదు. ఈ బుక్ printing చేయించడంలో నా కొచ్చిన అవకాశాన్ని నా మహద్భాగ్యంగా భావిస్తున్నాను. హైదరాబాదులో నా రూమ్మేట్ టైపింగ్ చేసేవాడు. అందువలన నేను ఒక కంప్యూటర్ సిస్టమ్ కొన్నాను. సార్ పంపించిన గ్రంధాలని నా రూమ్మేట్ టైపు చేసేవాడు. నేను ప్రూఫ్ రీడింగ్ చేసేవాణ్ని. అలా గ్రంథ ముద్రణకి నా వంతు సేవ చేసే భాగ్యం కలిగించారు.


అంతేకాకుండా అంతకు ముందు దాకా నెల్లూరులో పుస్తకాల ప్రింటింగ్ చాలా కాస్ట్లీగా ఉండేది. ఎప్పుడైతే హైదరాబాద్ కు ప్రింటింగ్ మార్చారో అప్పటి నుండి చిన్న చిన్న పుస్తకాలు ఒక్కొక్కటి ఒక రూపాయికి ప్రింటింగ్ జరిగేది. సార్ ప్రతి సంవత్సరం దాదాపు రెండు నుంచి మూడు లక్షల రూపాయల పుస్తకాలు ప్రింటింగ్ చేయిస్తుంటారు. అంతేకాకుండా ఎక్కడ తక్కువ ఖర్చుకి ప్రింటింగ్ చేస్తారో తెలుసుకొని చేయించడం ద్వారా సార్ గ్రంధాలు తక్కువ ఖర్చుకి ప్రింటింగ్ అయ్యేవి, మన అందరికి తక్కువ ధరలో స్వామి లీలలు, చరిత్రలు లభ్యం కావటానికి సార్ ఆరాటం, చేయించే యత్నం మనకు మార్గ దర్శకం.

2003లో సార్ తో నేను వెహికల్ కొనుక్కుంటాను అని అడిగితే సారు వెంటనే నువ్వు చేసే పనికి వెహికల్ తప్పనిసరిగా అవసరం కొనుక్కో అని చెప్పారు. మా ఇంట్లో సామాన్యంగా పగలంతా వెహికల్ బయట పెట్టేవాడిని. చాలా సార్లు వెహికల్ తాళాలు బండికే ఉంచేసే వాడిని. ఆ రోజు రాత్రి సారు కలలో కనబడేవారు. బండి క్షేమంగా ఉండేది. ఇప్పుడు అనిపిస్తోంది సార్ ని అడిగి బండి కొన్నాను కాబట్టి దాని సర్వ బాధ్యతలు సార్ వే అని. ఇది ప్రతి విషయంలో వర్తిస్తుంది అనిపిస్తోంది.

## వివాహం :

మా అన్నయ్యకి పెళ్లి సంబంధాలు కుదరట్లేదు. నన్ను పెళ్లి చేసుకోమని ఇంట్లో వారందరూ బలవంతం చేస్తున్నారు. సార్ కి వచ్చి ఆ విషయం చెప్పాను. నువ్వు దర్గాస్వామి దగ్గరకి వెళ్ళు అని చెప్పారు. స్వామి దర్గాల దగ్గర ఉన్న హుండీని కొడుతూ "గురువు చెప్పినట్లు చెయ్యట్లేదు, మీ అన్నయ్య పెళ్ళితో నీ పెళ్ళికి సంబంధం లేదు" అని చెప్పారు. స్వామి దగ్గర నుండి బయలుదేరే ముందర సార్ చెప్పిన మాట (దక్షిణ గూర్చి పాటించటం లేదనే స్వామి అలా అన్నారు అని) గుర్తు వచ్చి దర్గాల దగ్గర దక్షిణ సమర్పించాను. అక్కడ నుండి main రోడ్ మీదకి వచ్చి బస్సు కోసం ఎదురు చూస్తున్నప్పుడు ఒక కారులో ఇద్దరు తెల్ల వస్త్రాలు వేసుకున్న వారు వచ్చి ఎక్కడకి వెళ్ళాలి అని కనుక్కుని, వారు చిత్రంగా నాతో "తిరుపతి వెళ్ళాలన్నా, హైదరాబాద్


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

వెళ్ళాలన్నా అక్కడ దించుతామని" చెప్పారు. రేణిగుంటలో మా ఫ్రెండ్ దగ్గరకి వెళతానని చెప్పాను. వాళ్ళు నన్ను రేణిగుంటలో దించి వెళ్లారు. ఆ ఇద్దరు ఎవరో ఎందుకు అలా సాయం చేసారో స్వామికి, సార్ లకే తెలియాలి. సార్ దగ్గరకి వచ్చి స్వామి చెప్పిన విషయం చెపితే "5 వారాలు వరసగా మీ అన్నయ్యని గొలగమూడి లో స్వామి దర్శనానికి రమ్మను. ఆ తరువాత పెళ్లి కాకపోతే స్వామిది తప్పు అవుతుంది" అని సార్ చెప్పారు. నేను మా అన్నయ్యకి చెప్తే ఆతను వెంటనే 'నన్ను తీసుకు వెళ్ళు, తరువాత 4 వారాలు నేను వెళతానని' చెప్తే తరువాత రోజే తీసుకుని వెళ్ళాను. తరువాత 4 వారాలు కూడా వరుసగా వెళ్ళాడు. నెల తిరిగే లోపు అతని పెళ్లి జరిగింది. నా పెళ్లి మా అన్నయ్య పెళ్లి జరిగిన 3 సంవత్సరాలకి జరిగింది. 2002లో మా అన్నయ్య పెళ్లి జరిగింది. 2005లో నా పెళ్లి జరిగింది.

నా పెళ్ళికి సంబంధాలు చూస్తున్నప్పుడు కలలో ఒకసారి ఒకమ్మాయి కనపడింది. అందువలన ఏ సంబంధం చూసినా అది కాదేమో అనిపించేది. చిత్రంగా ఆ అమ్మాయితోనే నా వివాహం అయ్యింది. ఇంకా చిత్రమైన విషయమేమిటంటే ఆ అమ్మాయి వివాహానికి ముందర తన నాన్నగారికి అనారోగ్యంగా ఉన్నప్పుడు విజయవాడలో ఉద్యోగం చేస్తున్నప్పుడు ఒకాయన వెంకయ్యస్వామి గురించి చెప్పి, పటం కూడా ఇచ్చి రోజు దండం పెట్టమన్నారు. అలానే ఆమె చేస్తే వారింట్లో ఇబ్బందులు తీరటమే కాకుండా నేను పెళ్లి చూపుల్లో ఏం ప్రశ్నలు అడుగుతానో కూడా స్వామి కలలో చెప్పారు. అలా మా ఇద్దరినీ శ్రీ వెంకయ్యస్వామే కలిపారు. పెళ్లి అయిన తరువాత నా భార్య కు కూడా సార్ పుస్తక ప్రచురణ యజ్ఞంలో టైపు చేసే పని ద్వారా పాలు పంచుకునే భాగ్యం కలిగింది.

ఒకసారి మా బావగారికి బాగోక పోతే ఒక జ్యోతిష్కుడి దగ్గరకి తీసుకుపోయారు. ఆ జ్యోతిష్కుడు నన్ను చూసి నీకు ప్రాణగండం ఉంది, 40రోజులు అఖండ దీపం పెట్టాలి. అది ఆరిపోతే మంచిది కాదు. అందువలన నువ్వు ఇంట్లో చెయ్యలేవు. ఇక్కడ పెడతాము డబ్బులు ఇవ్వు అని అన్నారు. వాళ్ళు డబ్బులు మనుషులు లాగా ఉన్నారు అనుకున్నాను. సార్ కి చెపితే "వెంకయ్యస్వామి గాజులు తొడుక్కొని కూర్చున్నాడు అనుకున్నావా?" అని, "మీ అమ్మను ఊళ్లపాలెంలో అఖండ దీపం పెట్టమను, నీవు హైదరాబాద్ లో పావుకిలో పొంగలి వండి కాకబలికి పెట్టు" అని చెప్పారు. మేము అలానే చేసాము. ఇబ్బందులు తొలిగాయి.


## సొంత ఇల్లు – గృహ ప్రవేశం :

2010లో హైదరాబాద్ లో ఒక స్థలం చూసి తీసుకోవాలో లేదో స్వామి దగ్గర చీట్లు వేస్తే స్వామి తీసుకోమని చెప్పారు. కానీ డబ్బులు ఎక్కువ అడుగుతున్నారని రెండు పోర్షనల స్థలంలో ఒక పోర్షన్ మాత్రమే కొందామనుకుని సార్ కి చెపితే, స్వామి చెప్పింది ఎలా అయినా చేయాలి అని చెప్పి ఎంత డబ్బులు కావలి అని అడిగి, కావలసిన 3 లక్షలు రెండు రోజుల తర్వాత నా ఎకౌంటు లో డిపాజిట్ చేసారు. ఆ డబ్బుతో ఆ స్థలం కొన్నాను. మేము కొందామనుకున్న ఒక పోర్షన్ లో ఉన్న బోర్ పూడిపోయింది. సార్ కృపా అన్నట్లు రెండో పోర్షన్ లో ఉన్న బోరే ఆధారమైంది. సార్ చెప్పినట్లు చేయటం వల్ల ఇబ్బంది తొలగిపోయింది.

స్థలంలో ఇల్లు కట్టే మేస్త్రి చాలా కోపిష్టి. అతనితో ఏదన్నా చెప్పాలంటే ఇబ్బందిగా ఉండేది. అతని ఫోటో తీసుకు వెళ్లి సార్ కి చెప్పాను. సార్ ఆ ఫోటో తాకి ఇచ్చారు. తర్వాత నుండి అతని ప్రవర్తనలో ఎంతో మార్పు వచ్చి ప్రశాంత మనస్కుడు అయ్యాడు.



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

గృహ ప్రవేశానికి  రాత్రిపూట ముహూర్తం నిర్ణయించారని సార్ కి చెపితే "గృహప్రవేశం అయిన తర్వాత రాత్రంతా నామస్మరణ చేయమన్నారు". మేము అలానే చేశాము. మాకు ఏ ఇబ్బందులూ రాకుండా సార్ కాపాడుతున్నారు.

**ఆరోగ్యం :**

నా భార్య గర్భం ధరించిన తర్వాత 5 వ నెలలో గొలగమూడి వెళ్లి సార్ ని దర్శించుకున్నాము. అప్పట్లో నడక కష్టమని స్వామి గుడిలో 3 ప్రదక్షిణలు చేసింది. సార్ దగ్గరకి రాగానే నా భార్యతో సార్ "ప్రదక్షిణలు చేసావా అమ్మా!" అని అడిగారు. నా భార్య మూడు ప్రదక్షిణలు చేశాను అని తృప్తిగా చెప్పింది. సార్ నవ్వి రోజూ కనీసం అర గంట అయినా టైం పెట్టుకుని ప్రదక్షిణలు చేయమన్నారు. అలా చేయటం వల్ల అప్పటికి ఉన్న శారిరిక భాదలు తగ్గి, తర్వాత నార్మల్ డెలివరీ అయ్యింది. అప్పటి వరకు చాలా నెలలు నిండే వరకు గర్భవతులు వ్యాయామం గానీ నడవటం గానీ చేయాలని తనకు తెలియదు. సార్ ఆ రీతిన అవసరమైనది చేయించి అనుగ్రహించారు.

అలానే రెండవ సారి పాప డెలివరీ సమయంలో కూడా సార్ ఇది వరలో చెప్పిన రీతిలో నామస్మరణ చేస్తూ ఉండేది. ఏ పని చేస్తున్నా స్మరణతో చేయటం కూడా అలవాటు అయ్యింది. నెలలు నిండిన తరువాత డాక్టర్ గారికి చూపించుకుని delivery  కి హాస్పిటల్ కు వెళుతుంటే ఉమ్మ నీరు పోయింది. అచ్చట స్కానింగ్ ద్వారా బిడ్డ కండిషన్ చూద్దామని డాక్టర్ ప్రయత్నిస్తే ఆస్పత్రిలో ఉన్న 3 స్కానర్లు పనిచేయలేదు. నామస్మరణలో ఉండటం వల్ల భయం అనిపించక డాక్టర్ తో "స్టెతస్కోప్ తో చెక్ చేస్తే బిడ్డ condition తెలుస్తుంది" కదా అని అడిగితే డాక్టర్ అలానే చూసి డెలివరీ చేసారు. నార్మల్ డెలివరీ అయ్యాక, మీకు కొద్దిలో ఆపరేషన్ తప్పిపోయింది. బిడ్డ మెడకు ప్రేగు చుట్టుకుని ఉంది. స్కానర్ పనిచేసి ఉంటె ఆపరేషన్ చేసే వాళ్ళము అన్నారు. స్వామి/సార్ స్మృతి రహిత ప్రసన్నులుగా మా ప్రార్థన లేకుండానే ఆపద తప్పించి, ఆపరేషన్ తప్పించారు.

మా అబ్బాయికి చిన్న వయస్సులో గవడ బిళ్ళలు జ్వరం వచ్చాయి. వాటి నొప్పి భరించటం కష్టంగా ఉండేది. ఆరు నెలల వరకూ తగ్గదన్నారు. ఇంక ఉండలేక సార్ కు ఫోన్ చేస్తే గుండంలో కొబ్బరికాయ వేస్తాను బాగుంటుంది లే అన్నారు. అప్పటి నుండీ క్రమంగా సర్దుకుని ఒక నెలలో పూర్తిగా తగ్గిపోయింది. అలానే మరోసారి నీటిలో ఎలుక చనిపోతే తెలియక త్రాగడం వల్ల టైఫాయిడ్ జ్వరం వల్ల మా పిల్లాడికి చాలా అనారోగ్యమైంది. మరలా ధునిలో కొబ్బరికాయ వేయడం, రోజూ తీర్థం, విబూది స్వీకరించటం వల్ల త్వరగా కోలుకున్నాడు. మా బిడ్డల బాధ్యతలను ఇలా సారే వహిస్తున్నారు.

**విధి నిర్వహణ :**

నన్ను ఆఫీస్ లో కూడా సార్ కనిపెట్టి నడిపిస్తున్నారు. ఒకరోజు ఎక్కువ పని వల్ల వర్షం చీకటి ఉన్నా సాయంత్రం వరకు ఆఫీస్ లో ఉండి పని చేసుకుని ఇంటికి వస్తుంటే ఒక చెట్టు క్రింద నుండి వెళుతుంటే టప్ మని శబ్దం వచ్చింది. ఏమని వెనక్కి చూస్తే ఒక పాము ఒక్క రెండు అడుగుల వెనక నేను వచ్చే దారిలో పడి నా నుంచి దూరంగా opposite దిక్కులో పరిగెడుతోంది. అలానే నాకు Ph.d. చేయటంలో గైడ్ సహకారం అందటానికి, ఫార్మాలిటీస్ అడ్డు వచ్చినప్పుడు చాలా డిలే అయ్యింది. సార్ కు చెప్పుకుంటే సార్ అవుతుందిలే అన్నారు. ఆ తర్వాత వారి మనస్సులు, పరిస్థితులు మారి త్వరలో మార్గం చిక్కి Ph.d. కంప్లీట్ అయ్యింది. అలా ఉద్యోగం, వివాహం, తల్లిదండ్రులు, బిడ్డలు, చదువు, ఆరోగ్యం, ఇల్లు ఇలా అన్ని విషయాలలో సార్ అండ

ఉండటం, సార్ నాకు పుస్తక ప్రచురణ సేవలో అవకాశం ఇవ్వటం వారి కృపకు నిదర్శనం. కృతజ్ఞతతో జీవించేటట్లు నడిపించమని సార్ ని ప్రార్థిస్తున్నాను.

సార్ సందేశం :

చివరగా ఒక మాట వ్రాశావు. ఒక్కొక్కప్పుడు మనసు సాయిమీద ఉంటుంది. మరొక్కప్పుడు ఎక్కడో ఉంటుంది అని వ్రాశావు. నిజమే అనేక వేల కోట్ల జన్మల నుండి సంప్రాప్తమైనదే మన మెదడు. దానిని తన కోతిగంతుల నుండి అరికట్టడం చాలా కష్టమే. అయితే వీలు కానిది మాత్రం కాదు. దానినే బాబా శ్రద్ధ, సబూరి అన్నారు. అసలీ మనసు యొక్క చంచల స్వభావాన్ని అరికట్టాలి అనే శ్రద్ధ ఉండాలట మాష్టరు చెపుతారు. "శ్రద్ధ అనేది అనుక్షణము ఉండవలసిన జాగ్రత్త అంటారు". మనసులో ఇతర ఆలోచనలు వస్తే అది మానసిక వ్యభిచారమని భావించాలట. చేయవలసిన యోచనగాక మనకు దానంతట అది ఎక్కడకో వెళ్ళి ఆలోచించటమే వ్యభిచారం అన్నారు. శ్రద్ధ అనేదాన్ని బాబాకు సమర్పించడమంటే చాలా గొప్పవిషయం.

ఆలోచనలకు ఆనకట్ట వేసే జీవన విధానానికి సార్ సూచనలు ఈ క్రింద సార్ లెటర్ల నుండి గ్రహించ వచ్చు:

మనసును ఎప్పుడూ కూడా ఖాళీగా వదలగూడదు. నిరంతరం పనిలో నిమగ్నం చేయమంటారు. పనిలేని మనసే సర్వ అనర్థాలకు మూలమంటారు. పని చేస్తూ మనసు మాత్రం పిచ్చిగా యోచిస్తుంటుంది. అది తప్పు. మనసు పనిలో నిమగ్నమవాలట. దానిని త్రికరణ శుద్ధి అన్నారు. (1) శరీరంతో పని చేయడం (2) నోటితో దైవనామం చెప్పడం (3) మనస్సుతో ఆ పని ఎలా చేయాలో యోచిస్తూండడం. వేరే తలంపు రాకూడదు.

పని లేనప్పుడు విశ్రాంతి కోరినప్పుడు "ఈ చూడబడే దంతా కలిసి నేను" అన్న బాబా వాక్యాన్ని విశ్లేషిస్తుండు. మంచి మేత దొరకుతుంది మనస్సుకు - ఎలా?

సూర్యుణ్ణి చూచాము - సూర్యుడు, సూర్య కిరణములు, అందులోని వెలుగు, అందులోని వేడి, వీటి ద్వారా చూడబడే వస్తువులు, వస్తువులు చూచుటకు ఉపకరించే కన్నులు, కన్నులలోని ప్రాణశక్తి, నేను చూస్తున్నాను అని తెలిపే ఎరుక - ఇవన్నీ బాబానే అయినా నేను వేరు ఈ జగత్తు వేరు అనే భావనే అడ్డుగోడ. దాన్ని కూలదోయడం ఎలా బాబా, అదెలాగో నాకు నేర్పించకూడదా అని అడుగుతుండు.

అలాగే రోడ్డున నడుస్తున్నాము. భూమి, దానిపై కనిపించే దుమ్ము, పేడ అన్నీ ఆయనే. ఈ శరీరం కూడా ఆయన శరీరం చుట్టూ ఉన్న గాలీ ఆయనే. శరీరాన్ని నడిపించే ప్రాణశక్తి ఆయనే. నడుస్తున్నట్లు తెలుసుకొనే ఎరుక గూడా ఆయనే. అంత ఆయనే ఐన నేను అనే పరిమిత భవమే అడ్డుగోడ. దీన్ని కూలద్రోయమన్నావే అది ఎలా బాబా అని అడుగు.

స్నానం చేస్తున్నాము - ఈ నీరు బాబానే, మనం నిలుచునేందుకు ఆధారమైన భూమి ఆయనే. స్నానం చేసే శరీరం ఆయనే, ఆయనను ఆయన చేతనే కడిగిస్తూ హాయిని ఇప్పిస్తూ హాయిని అనుభవించుమన్నట్లు తెలుసుకుంటున్న ఎరుక ఆయనే కానీ నేను అనే పరిమిత భావమే అడ్డుగోడ దీనిని కూలద్రోయడం ఎలా అని అడుగు.


ఇదే విధంగా అన్నం తినేటప్పుడు, నీళ్ళు త్రాగేటప్పుడు, పనిలేని విశ్రాంతి సమయాలలోని నీవు చూచే ప్రతి వస్తువు వంక నవ్య నూతనంగా చూడమంటారు మాష్టర్. నాకు అడ్డుగోడను కూలద్రోసే technique చేతగాకున్నా ఇలా వ్రాయడం మాత్రం కొద్దిగా వచ్చు. అడ్డుగోడను ఎప్పుడు కూలద్రోయిస్తారో, అది శ్రీ స్వామి వారి పని.

శ్రద్ధతో - చదువ లేనప్పుడు మనసు విశ్రాంతి కోరినప్పుడు - ఎక్కడో ఆలోచించకుండా చూచిన ప్రతివస్తువు లోను విశ్లేషించి బాబాను చూస్తుంటే అది కుడా ధ్యానమే అవుతుంది. ధ్యానమంటే కళ్ళు మూసుకొని కూర్చోవడమే కాదు.

ఆశీస్సులతో

పె. సుబ్బరామయ్య


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

గొలగమూడి
26-08-1999

Dear Raja! Blessings!

నీ విచ్చిన పాంప్లెట్ చదివాను. సిద్ధ సమాధి యోగ S.S.Y. ఇందులో ధ్యానము, ప్రాణాయామము నేర్పుతామని ఉంది. ధ్యానము చేసినందువల్ల నష్టం లేదు. ధ్యానానికి ఏ పద్ధతైనా పరవాలేదు. ఆలోచనా స్రవంతిని అరికట్టడమే అందులో ముఖ్యసూత్రం. ఏ పద్ధతిలో అరికట్టాలనేది ముఖ్యం కాదు. కానీ ప్రాణాయామము పూజ్యశ్రీ మాష్టారు పద్ధతికి విరుద్ధము. అసలు ప్రాణాయామాన్ని చేయవద్దని కూడా చెప్పేవారు. ప్రాణాయామాన్ని గురు సన్నిధిలో అభ్యసించి ఆరితేరిన ఆరూఢులైన వారే దాన్ని ఇతరులకు నేర్పు సమర్థులు. అలాంటి వారు చాలా అరుదు. ఈ కలికాలంలో 'అందరూ గురువులై పోతున్నారు' అనేవారు. శ్వాస ద్వారా ఆలోచనలను క్రమపరచడం, ఆలోచనలు క్రమపడితే శ్వాస క్రమపడుతుంది. శ్వాస ద్వారా ఆలోచనలు క్రమపరచడం అంటే ప్రాణాయామం అభ్యసించడం అపాయమని చెప్పేవారు గనుక దాని మీదకు నా మనసెప్పుడూ పోలేదు.

ధ్యానం నేర్పుతారు అని చెప్పారు. ధ్యానానికి అడ్డు వచ్చేవేవో వివేక విచారాలతో తొలగించుకొనక పోతే ఎన్నాళ్ళయినా ధ్యానాన్ని అభ్యసిస్తూ ఉండవలసిందే. ఇష్టాయిష్టాలు లేకుండా జీవించగలగడం అనే జీవిత కళ అభ్యసిస్తే ధ్యానం చాలా సులభంగా కుదురుతుంది. కావాలి అనే కోరికలన్నీ వదిలేసి నన్ను సంపూర్ణంగా శరణు జొచ్చావంటే నీ భాధ్యతలన్నీ నేను మోస్తాను అన్న బాబా హామీ ఎంతగొప్పదో చెప్పలేను. ప్రతినిత్యం మూడుపూటలా తినేటప్పుడు విధిగా నామజపం చేయలేని మనకు ధ్యానాన్ని అభ్యసిస్తేనే శాంతి శిఖరాలు ఎక్కుతామనేది భ్రాంతి మాత్రమే. జీవిత కళ తెలిసి అభ్యసించాలి. కావాలి అనే కోరిక కూకటి వేళ్ళతో పెకలిస్తే అదే సర్వస్వశరణాగతి. అప్పుడు ఎవరూ నేర్పించనక్కరలేకుండా మనసు ధ్యానస్థమవుతుంది. ఈ కర పత్రం మంచిది కాదు. అని నీవు ప్రచారం చేయవద్దు, అభిరుచిగలవారిని నేర్చుకోనివ్వు. మనకు నష్టమేముంది. సలహా అడిగినవారికి చెప్పు. అంతేగాని మనంగా ఎవ్వరికీ చెప్పకూడదు. సాయి కృప - పంపుతున్నాను. బాగా చదివి ఆనందించు. వారిని శరణు పొందగలగడమెంత గొప్ప ఆనందదాయకమైన విషయమో మన అదృష్టమెంత గొప్పదో ఆనందించు. నీవు లెటరు వ్రాస్తే నేను వ్రాయగలను. ఏ ప్రశ్నలేకుండా నేను ఏమీ వ్రాయలేను. అందరికీ నమస్కారములు తెలుపు. లక్ష్మక్క గారికి లెటరు వ్రాస్తాను.

సాయి కృప జిరాక్సు తీసి పంపడము ఆలస్యమవుతుంది. ఆశీస్సులతో
పె.సుబ్బరామయ్య.

గొలగమూడి
11-03-1999

పూజ్యశ్రీ పి.యస్.రావు గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పె.సుబ్బరామయ్య వ్రాయడం.

స్వామీ! నేనెవ్వరికీ గురువును కాను, నాకట్టి సామర్థ్యము లేదు. లోకం మీద లక్షల సంఖ్యలో గురువులై వారి వలన భూభారము పెరిగిపోతున్నది. మరలా నన్ను గూడ ఆ లిస్టులో చేర్చవద్దు. నాలాంటి నీచ సంస్కారములు గలవారు ఆ పేరుతో పిలవబడడం మంచిది కాదు.

శ్రీ సాయినాధుడు, పూజ్య మాష్టారు, శ్రీ స్వామి వారు ఉండగా మరలా నాలాంటి మానవమాత్రులను ఆశ్రయించుట అపచారమవుతుంది.

మీ సమస్యకు నాకు తెలిసినంతవరకు సమాధానము వ్రాస్తాను. సత్యముంటే స్వీకరించ ప్రార్థన. మౌనము రెండు విధములు, బాహ్యమౌనము, అంతర మౌనము. లోకంలో నాకు తెలిసినవారంతా బాహ్యమౌనము పాటిస్తున్నారు. బాహ్య మౌనము పాటించే కొద్దీ లోపల మనస్సు ఎక్కువ వేగంగా తిరుగుబోతవుతుంది. అలా మనస్సును తిరుగుబోతుగా చేసే కంటే మౌనం లేకుండడమే మంచిది. ఈ మౌనము పాటించే వారంతా పలక దగ్గరుంచుకొని తమభాషలు సంభాషణలు వ్రాస్తుంటారు. అది గొప్ప అపచారము.


లోపల ప్రశాంతత ఏర్పడ్డప్పుడు మాట్లాడేందుకు వీలుకాదు. అదే అసలైన మౌనము. అలాంటప్పుడు అవసర మయిన మాటలు మాట్లాడినందున తప్పులేదు గనుక ఏ పలక అవసరం లేదు. అంతా తానై ఉన్న శ్రీ సాయితో తాదాత్మ్యం చెందినప్పుడు తనకంటే అన్యమేదియూ లేదుగనుక మాట్లాడే ప్రశక్తే లేదు. అన్నంకావాలి అడిగి పెట్టించుకోవడమే. అందులో తప్పులేదు. నియమభంగం లేదు. అన్నంతినాలి పెట్టండి అని పలకమీద వ్రాసినా నోటితో చెప్పినా ఒకటేనని భావము. మీకు ఉండాలని (మౌనంగా) అనిపిస్తే మౌనములో ఉండవచ్చు. కానీ అది ఒక నియమంగా పలక పెట్టుకొని ఉండవలసిన అవసరం లేదు. మనసు నిశ్చలమవ్వాలి అది అసలు రహస్యము. దానిని సాధించుటకు మార్గము ఎవరికి వారే చూచుకోవలెను. శ్రీ సాయినాధుడు జగద్గురువై ఉండగా మరొకరెందుకు? ఆయన మీద నమ్మకము లేకుంటే శ్రీ మాష్టారు గారిని గురువుగా పెట్టుకొని అడుగు వారు తప్పక మనకు మార్గం చూపుతారు.

వారు మనమధ్య లేరు గదా? అనే భావం వచ్చిందంటే నీవు మౌనం పాటించి ప్రయోజనం లేదు.

మీరే వృత్తి చేస్తారో తెలియదు. ప్రస్తుతం మీ వయస్సు ఎంత? మౌనం పాటిస్తే వృత్తి చేయడం ఎలా? వృత్తి చేయకుంటే ఋణానుబంధాలు తీరేదెలా? ఋణానుబంధాలు తీరకుండా ముందుకు పోవాలని వాంఛించడం అధర్మం కదా? ఋణానుబంధాలు తీర్చుకుంటూ సంపూర్ణ శరణాగతితో ముందుకు సాగాలి. ఏ మాత్రం తీరిక చిక్కినా అంతర్ మౌనములో శ్రీ సాయి నిజతత్వంలో ఏకత్వం పొందాలి. అలాకాక పని చేస్తుంటే ప్రతి పనినీ ఆయన సేవగా భావించి చేసే బుద్ధికుశలత కలగాలి. ఏ పని చేసినా అన్నం కొరకే గదా. ఆకలి పరమాత్మ గనుక అన్నం కొరకు పని చేయడమంటే ఆ పని పరమాత్మ సేవ అన్నమాట దానిని ఎంతో నిర్దుష్టంగా హృదయపూర్వకంగా చేయగలగాలి. శ్రీ స్వామి వారంటారు "అయ్యా! ఈయన మనుషుల్లోకి పోయి వచ్చాడు. ఈయన వద్దు ఆయనకు బదులు నీవు పోయ్ వావ" అనేవారు. ఇది గుర్తుపెట్టుకుంటే చాలు. మన పని సంపూర్ణమయిందన్న మాటే.

నమస్కారములతో
మీ పె.సుబ్బరామయ్య.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

గొలగమూడి
17-6-1997

పూజ్యగురుబంధు శ్రీ నాగేశ్వరరావు మాష్టరు గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు. అంతా క్షేమము. మీరు యావన్ మంది శ్రీ సాయి మాష్టర్ దయవల్ల క్షేమమని ఆశిస్తాను.

కాలము ఎంత త్వరగా నడిచి వెళుతుందో మనమంత త్వరగా మృత్యువుకు సమీపిస్తున్నామన్న సత్యం మనందరమూ గుర్తించకున్న పరమ సత్యం. అందుకే చివటం అమ్మ "పొద్దుగూకుతుంది చెయ్యి చాచండర్రా" అనే వారు దమ్మపేట నివాసులు ఎంతో అదృష్టవంతులు. ఆ మాత్రం నిత్య సత్సంగాలు జరుపుకోగలుగుతున్నారు. మీరు అందులో భాగస్వాములు కావటం అది మీ అదృష్టం. సాయి బాబా పక్షపత్రికలో ఆరాధనాంజలి 97 సం|| నిష్కామకర్మకు మాష్టరుగారి ఆసిడ్ టెస్టు అన్న వ్యాసం అందరికీ చదివి ఆచరించేందుకు సహకరించ మనవి.

మన అగ్నిహోత్రంలో నిత్యం:

1. సాంబ్రాణి సమర్పించటం చాలా ముఖ్యం, శ్రీ స్వామి వారు "అయ్యా గుండంలో గంటెడు సాంబ్రాణి నిత్యం వేసుకుంటే లెక్క సరిపోద్ది" అని పదే పదే చెప్పేవారు. గనుక మేము నిత్యం సాంబ్రాణి సమర్పిస్తాము.
2. సాయినాథుడు అగ్నిరూపంలో ఉన్నారనే భావన ముఖ్యం వారికి నివేదన సమర్పించేటప్పుడు ఆ పదార్థాలన్నీ విస్తర్లో పెట్టి సమర్పించడము ముఖ్యమట. మనం ఆహారం ఎలా తీసుకుంటామో, అలాగే వారికి నివేదించాలని మాష్టరుగారు చెప్పేవారు. విస్తరలేకుండా మనం భోంచేయము గదా. గనుక అలా విస్తరలో పెట్టి అగ్ని హోత్రంలో సమర్పిస్తే మంచిది.

3. పారాయణతో మాత్రమే తృప్తి చెందక నిత్యం పూజ చేసుకునే విధానం కూడా సత్సంగీయులకు అలవాటు చేయమనవి. మొదట అష్టోత్తరం తరువాత షోడశోపచార పూజ అలవాటు చేయండి. నేను పూజంటే అంగీకరించ కుండే వాడను. మాష్టరు నాచేత పూజ చేయించేటట్లు ఉత్సాహపరచి దాని గొప్పదనం వివరించారు. అది మొదలు చేసుకొనే వాణ్ణి. ఉత్తమ పుణ్యకర్మలలో దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞ పూజనం చెప్పబడింది. ఆ పూజ మానసిక, వాచక, కాయక పూజగా ఉంటుంది. కనీసం కాయక పూజైనా చేస్తుంటే అవతలి మెట్టు ఎక్కుతారు.

మనకాలాన్ని సద్వినియోగం చేసుకునే సద్బుద్ధిని సాయినాథుడు మనందరికి ప్రసాదించాలని ప్రార్థిస్తూ,

మీ
పె.సుబ్బరామయ్య.

శ్రీమతి లక్ష్మక్క గారికి శాస్త్రిగారికి సత్సంగీయు లందరికీ నా నమస్కారములతో శ్రీ స్వామి వారి ఆశీస్సులు తెలుప మనవి.


నమస్తే
పె.సుబ్బరామయ్య

**<u>శ్వాసను గమనించుట</u>**: అసలు శ్వాసను ఎందుకు గమనించాలి? అలా గమనించేటప్పుడు మనలో ఏమి జరుగుతుంది? ఇవి తెలుసుకొని చేయడం ముఖ్యం.

శ్వాసను గమనించే ప్రక్రియ యొక్క ముఖ్యోద్దేశ్యం ఒక్కటే ఆలోచనలరూపంలో నిరంతరం చలించే మనసుకు ఒక ఆలంబన కలిగించి చలించకుండా నిలపడమే ధ్యేయం. శ్వాస అనేది అన్ని జీవులలోను ఎడతెరిపిలేకుండా జరిగే క్రియ. ఆలోచన అనేది కూడా ఎడతెరిపి లేకుండా జరిగేక్రియ. ఈ ఆలోచనలకు మన మనస్సే కారణం. కనుక ఈ మనస్సుకు శ్వాసను గమనించుట అనే పనికల్పించి ఆ పని ఆలంబనగా మన మనస్సులో వేరే ఆలోచన పుట్టకుండా జాగ్రత్త వహించుతాము. గనుక చంచలమైన మనస్సు ఈ ప్రక్రియ ద్వారా కొంతసేపు చలనము లేకుండా ఆ క్రియలో నిలపాలి.

అలా నిలపడం కష్టమే. అయితే అప్పుడు కాస్త ఆ మనస్సుకు మన ఇష్టానుసారం (దాని ఇష్టాను సారం కానీ) కొంచెం చలనము ఇస్తాము. కొద్దిగా ఆలోచన కల్పిస్తాము. ఎలా? ఈ శ్వాసక్రియ ఎలా జరుగుతుంది? జీవిలో ప్రాణముండడంచే జరుగుతుంది. ప్రాణమునకు ఆధారం చైతన్యం. నేను శ్వాశిస్తున్నాను అని మనకు తెలుస్తుంది. అలా తెలిపేది ఎరుక. గనుక శ్వాసక్రియకు ప్రాణచలనము, ఎరుక ఇన్నీ ఉన్నాయి గదా. ఇవి అన్నీ జీవులలోనూ ఒకే విధంగా ఉన్నాయి. అయితే మనం దేహ పరిమితులమన్న భ్రాంతిలో ఉండడంచేత ఇతర జీవుల కంటే భిన్నంగా ఉన్నట్లు అనిపించి రాగద్వేషములు కల్గు చున్నాయి. ఓ బాబా నన్ను దేహ పరిమితుడను అనే భ్రాంతి మయ జీవితం నుండి ఉద్ధరించు తండ్రీ అని తిరిగి తిరిగి ఆయనను వేడిస్తూ ఉండడం ద్వారా మన మనసులో వేరే ఆలోచనలు కాకుండా కేవలం ఆ ఒక్క ఆలోచనకే పరిమితంగా మన మనసును నిలిపే ప్రయత్నం చేయాలన్నమాట. అభ్యాసం మీద ఈ వివరణంతా పోయి గమనించుట అనే ప్రయత్నంలో నిమగ్నమై కొంత వరకు ఆలోచనలు అరికట్టగల్గుతాము.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

<u>కోపము</u>:- <u>నిగ్రహించే మార్గము</u>

కోపము కలిగించే కారణమేమి?

ఒకటి ఇష్టము అయిష్టము
రెండు కావాలి అనే కోరిక
ఇష్టము అయిష్టము గానీ కావాలి అనే కోరిక అర్థరహితాలని వివేకం ద్వారా తెలుస్తుంది.

నిరంతరం మన ధ్యేయం మనకు గుర్తుండాలి. ధ్యేయం ఏమిటి - దు:ఖరాహిత్యం - అందుకు మనస్సును నిగ్రహించడం అవసరం. మన ప్రస్తుత ప్రయత్నంలో ఏమీ మనం పొందేది లేదని మనకు ఏమేమి రావాలో ఏమేమి అనుభవం కావాలో ముందే మన ప్రారబ్ధానుసారం నిర్ణయించబడియున్నాయని ధృడంగా విశ్వసించాలి. మనం ప్రయత్నించకుండా కూర్చున్నా ఆ టైం వచ్చినప్పుడు మన ప్రారబ్ధమే ఆ పని ఆ క్షణంలో చేయించి తీరుతుంది. శ్రీ స్వామి వారి చరిత్ర, సాయి చరిత్ర, మాష్టరుగారి వాక్కులు, వేద వ్యాసు గారి అనుభవము.

ఇష్టము అయిష్టము, రాగము ద్వేషముల ద్వారా మనకు క్రొత్త బంధాలు తగులు కోకుండా జాగ్రత్త వహిస్తూ ఏ విషయంలోను శాంతంగా చెప్పవలసినది చెప్పడం వినకుంటే వారి ఖర్మకు వారిని వదలడం. మనం మంచాన పడితే వాళ్ళు చూడరేమోననే భయం ఉంటుంది ఒక మూల హృదయంలో. మన ప్రారబ్ధం కొద్దీ ఎవరి ద్వారా ఏమిపొందాలో అది తప్పక అనుభవమయి తీరుతుంది. మనం భయపడి మన మార్గం వీడనక్కరలేదు. సత్యాన్ని నిరంతరం గుర్తుంచుకోవాలి. వివేక విచారాలతో రాగద్వేషాలు నిర్మూలించుకోవడం తప్ప కోపాన్ని జయించి లొంగదీసుకోవడం వీలే కాదు. రాగ ద్వేషాలు కోపం అంతమేరకు అదుపులోకి రావడం పరమ సత్యం.

OM

24-06-2005

Dear sai!

మానవుని సమస్య ఏమిటి? ఉన్నదానితో అసంతృప్తి లేనిదాని కై తపన అంటారు శ్రీ మాస్టారు. నీవు వారం వారం15 రోజులకు ఇక్కడకు రావాలంటావు. శ్రీ స్వామివారు మనకిచ్చిన సదవకాశం నీ అసంతృప్తి వలన సద్వినియోగం చేసుకో లేకుండా ఉన్నావు. ఈ ప్రపంచ వాసన లేకుండా నిన్ను I.I.T Campus శ్రీ స్వామివారు నీకు ఒక పని అప్పగించి చేయమంటే, అది కాదు నేను గొలగమూడి లో ఉంటాను, వారం వారం వస్తాను అనడం, ఉన్నదానితో అసంతృప్తి లేని దానికై తపన అనే మానవుని సమస్యను నీవు వదలలేదు. ఆధ్యాత్మికత అంటే గురువు మాటను implicit obedience గా ఆచరించడం అనేది నీ ఆచరణలో వచ్చేంతవరకు శ్రీ స్వామివారి కృప మనం సంపూర్ణంగా పొందలేము. ఎర్రిస్వామి, తిక్క స్వాముల కథ మర్చిపోయావు. తిక్క స్వామి ఎంత గొప్పవాడో !గురువు మాటకుఎదురు ఒకమాట చెప్పకుండా వెళ్ళిపోయాడు. రోశి రెడ్డి కూడా తిక్క స్వామి ఇలాంటి మహనీయుడే.

ఇక్కడుంటే నాకు ఎన్ని బాధలు ఉన్నాయో మీకు తెలుసా? ఎప్పుడూ ఏకాంతంగా కూర్చోనివ్వరు. ఎవరో ఒకరు వస్తారు. ఇంటిలో వారు ఎప్పుడు అక్షింతలు వేస్తుంటారు. ఎందుకు? వాళ్ళను గురించి నేను పట్టించు కోనుట. పుస్తకాల అంగడి ఆయన రోజుకు ఒక సమస్య తెస్తాడు. సాయి మాస్టర్ నిలయం తాత రోజుకు5 లేక6 సమస్యలు తెస్తాడు. వీటన్నిటిని తప్పించుకుని ప్రార్థించాలా? No. ఈ బాధలన్నీ పట్టుకుంటేనే నా మురికి వదులుతుంది.

ఋణానుబంధాలు, వాగ్దానాలు తీరాలి కదా. మనకు ఆరోగ్యము, అన్నం పెట్టారు. ఇంకేమి కావాలి. తక్కిన విషయాలన్ని వీటిలో భాగాలే. ఆట ఆడడం నేర్చుకోవాలి.

శ్రీ స్వామివారి కృపా సదా మీకు ఉండాలని ప్రార్ధన
పెసల సుబ్బరామయ్య


గొలగమూడి22 ,**-7-2005**

Dear Sai!

నిన్నటి లెటర్లో శ్రీ స్వామివారు నా ఇల్లు కట్టించిన విషయం వ్రాశాను. అప్పుడు నేను యమతిండి తింటూ ఇద్దరు మనుషుల పని చేస్తున్నాను. కామాంధుడినై కన్ను కానని రోజులవి. ఒక్క సారైనా నా ఇల్లు కట్టే పనిలో సహాయము చేయమని నేను స్వామిని ప్రార్థించి ఎరగను. అంతా చేయ వలసింది మనమే గదా! వారేమి చేస్తారనే అహంకారము తలకెక్కిన రోజులు అవి. ఎసరు పెట్టి మనం మంట చేస్తే వంట అవుతుందనే వెధవ వేదాంతం. బియ్యపుగింజ తయారుచేయటం మనకు చేత కాదనే విషయమే స్ఫురించని కామాందపు రోజులవి. శ్రీ సాయి మాస్టర్ నిలయం ఉండే చోట శంకుస్థాపన గుంట కొంత త్రవ్వి పూడిపించారు. నా ప్రార్థన లేకనే వాస్తు ప్లాన్ గీసి ఇచ్చారు. నా ప్రార్థన లేకనే మా మామ పునాదులకు డబ్బు ఇస్తాను అని బలవంతం చేసాడు. నా ప్రార్థన లేకనే పరంధామయ్య బేలుదారిగా వచ్చాడు. నా ప్రార్థన లేకనే బిల్డింగ్ అంతా ఒకే ఒక బండ పడి పునాదులు కట్టే పని ఖర్చు లేకుండా పోయింది. **మన ప్రార్థన లేకుండానే సర్వం జరిగిపోతుంది. అది ఆ సద్గురుమూర్తి కృప. ఇంత జరిగినా ఇలాంటివి ఒకటి రెండు కాదు వందల అనుభవాలు జరిగినా ఈ మలిన మనసు నేటికైనా కుదురుగా ఉండమన్న చోట ఉంటుందా. అటు భవిష్యత్తునో లేక గతాన్నో యోచిస్తోంది. ఏమో దీన్ని ఆ సద్గురుమూర్తి ఎప్పుడు హతమార్చి కూర్చోబెడతాడో తెలియదు. తప్పక కూర్చో పెడతాడు. ఈలోగా ఇంద్రియలోలత్వం,ఆశ , సోమరితనం,పరదూషణ ,జిహ్వాచాపల్యం, స్త్రీలోలత్వం అను నాలోని దొంగలను కనిపెట్టి తరిమే ప్రయత్నం చేయాలి. సిన్సియర్ ప్రయత్నం చేయాలి. శ్రద్ధ కాదు కేవల శ్రద్ధ అవసరమంటారు శ్రీ మాస్టారు గారు. శక్తి నంతా వినియోగించి కృషి చేయమంటారు సాయి. లేకుంటే మానవ జన్మ పిడకలు ఏరుకునేందుకేనంటారు. అలాంటి దౌర్భాగ్యస్థితి కాకుండా వారిచ్చిన పనిచేసే ప్రయత్నం సిన్సియర్ గా చేసి తరిద్దాం.** అక్క గారికి నమస్కారములు.

శ్రీ స్వామివారి కృపా సదా మీకు ఉండాలని ప్రార్ధన
పెసల సుబ్బరామయ్య


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

గొలగమూడి22 ,-7-2005

అమ్మా !
మనం ఏదైనా చెయ్యాలన్నా చేయలేము. చేయలేకుండా ఉండాలన్నా ఉండలేము. ఉదాహరణకు నా కుమార్తె అప్పుడు రైల్వేలో షోలాపూర్ ప్రక్కన హుటిగీ అనే స్టేషన్లో పార్మసిస్టుగా పనిచేస్తోంది. అప్పుడే స్టేట్ బ్యాంకులో ఉద్యోగానికి ట్రైనింగ్ కి రమ్మని ఆర్డర్ వచ్చింది. రైల్వే పెద్ద సంస్థ అని, స్టేట్ బ్యాంకు చిన్న సంస్థ అని స్టేట్ బ్యాంకులో చేర్చేందుకు నాకిష్టము లేక ఆ ఆర్డరు కాగితం పంపలేదు. భగవంతుని నిర్ణయం ఆమెను బ్యాంక్ లో ఉద్యోగం చేయించాలని, గనుక ఆమె పని చేసే గ్రామంలో ఆ ముందటి రోజు డాక్టరును చంపే ప్రయత్నం చేశారు. ఆ రోజు డాక్టరు లేకుండా ఉంటే మా అ మ్మాయికి ఆమర్యాద జరిగి ఉండేదే. అందుకని తెల్లవారి సామాను సర్దుకొని ఇంటికి రాబోతోంది. అదే సమయంలో నేను షిరిడీ పోవాలనే ప్రేరణ పెట్టి బ్యాంక్ ఆర్డర్ ఊరక తీసుక పొయ్యాను. షిరిడీ ప్రయాణము మానుకుని తెల్లవారి 10 గంటలకు తిరుపతి ట్రైనింగ్లో చేర్చాలి. వెంటనే హుటిగీ నుండి తిరుపతి వచ్చి ట్రైనింగ్లో చేర్చాను. నా షిరిడి ప్రయాణము పోయింది.
నేను అనుకున్న శిరిడి యాత్ర సాగలేదు. భగవంతుని నిర్ణయానుసారం ఆమె స్టేట్ బ్యాంకులో ఉద్యోగి అయింది. బ్యాంకు ఉద్యోగినే వివాహమాడి నెల్లూరులో ఇల్లు కట్టుకుని కాపురం ఉన్నారు. మనం ఒక పని చేసేందుకు చేయకుండా ఉండేందుకు స్వేచ్ఛ లేనివారము. భగవంతుని చేతిలో ఉపకరణాలు మాత్రమే. ఇది తెలిసి దేనికి చింత చేయకుండా హాయిగా నీ ఇష్టం వచ్చినట్లు నడుపు తండ్రి అంటూ సంతోషంగా ఉంటే ఈ నాటక రంగంలో మన పాత్ర బాగా నటించిన వారము అవుతాము.

– పె.సు.

గొలగమూడి

15-07-2005

పూజ్య గురువుల లక్ష్మక్క గారికి సుబ్బరామయ్య శ్రీ స్వామివారి ఆశీస్సులు తెలుపుతూ వ్రాయడం.మీ లెటర్ చేరింది.ఆ మహనీయుని ఆశ్రయించడం లో మన పుణ్యం ఇమిడి ఉంది. మనం క్రింద పడుతున్న వారు మనలను పడనివ్వరు. రోశి రెడ్డి కుమారుని బండి ఎద్దులు, మనిషిని ఎలా రక్షించారు. మనకు కష్టాలు కలగడం మన మంచి కొరకే అని భావిస్తూ వారి వైపు చూస్తుంటే చాలు.మనం చలనం లేని విశ్వాసముతో వారినంటి పెట్టుకోవడమే మన ప్రయత్నమంతా. పోయే వాళ్లను పోనిచ్చేదే గదయ్యా అనే మాట మనకు వర్తించదు. వారు చీటీ ల ద్వారా చెప్పిన మాట కి మనం అంటిపెట్టుకుని నడుచుకుంటున్నాము. పోయే వాళ్లను ఫోనిచ్చే దే గదయ్యా అన్న వాళ్ళ సంగతంతా చాలా ఘోరం. శ్రీ స్వామి వారు ప్రత్యక్షంగా శరీరముతో ఉండగా చెప్పిన మాటను వాళ్ళు ఖాతరు చేయలేదు. కత్తితో పొడుస్తా అని చెప్పిన వారు తమ చెడ్డ నడవడి మార్చుకోలేదు. అలాంటి వారితో మనం పోల్చుకుని అలా మనమూ అవుతామని భయపడవద్దు.సర్వ హృదయాంతర్వర్తియైన ఆ మహనీయుడు మనలను తప్పక నడిపించి గట్టెక్కిస్తాడు.

భయము, ఆందోళన, దుఃఖము కాస్త కూడా దరిచేరకుండా చూసుకోవాలి. భయము,, ఆందోళన ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా వారి సర్వ సత్యము మర్చిపోయామని అర్థం.

బస్సులో రిజర్వ్ చేసిన టికెట్లు క్యాన్సిల్ చేయించింది వారే. హైదరాబాద్ డాక్టర్ మిమ్మలను వెంటనే రమ్మ నకుండా కాగితం మీద వ్రాసిస్తాను అని అనిపించింది ఆయనే. మద్రాసు డాక్టరు 15 రోజులకు మందులు వ్రాసేనట్లు చేసింది వారే. 15 ఆగస్టు వస్తుంది.

ఆగస్టులో పరీక్ష రాశాక నే హైదరాబాద్ ప్రయాణం. అప్పుడు కూడా డాక్టర్ గారికి రమ్మంటే వెళ్ళుతాము. ఇక్కడ ఒక వ్యక్తి 40 రోజులు ఉండాలన్నారు. సరేనన్నాను. వారు వచ్చిన పని స్వామి కంటే ముఖ్యం, ప్రేమికుల సంభాషణలని నాకు ఎలా తెలుస్తుంది. ఒక వ్యక్తి రాత్రి 12 గంటలప్పుడు మాట్లాడుకుంటుంటే చూసి చెప్పాడు. నేను పట్టించుకోలేదు. ఆమె కు వార్నింగ్ ఇచ్చాను. అప్పుడు ఆమె ఆ వ్యక్తి మా ఎదురింటి వాడని నాకు చెప్పాలా. స్వామిని గురించి అడిగితే చెప్పాను అంతే అన్నది. తెల్లవారి మరికొన్ని వివరాలు తెలిసాయి. మొదట ఆమె చెప్పిన మాటలకు రెండవసారి పిలిచి అడిగినప్పుడు చెప్పిన మాటలకు పోలిక లేక కఠినంగా మాట్లాడి తరిమేశాను. ఆ తర్వాత మరికొన్ని వివరాలు చెప్పారు. వారి ప్రేమ విఫలమై టీ త్రాగి చనిపోవాలని మందు సీసాలు ఉంటే చేశామని చెప్పారు వారు త్రాగి ఉంటే ముందు నన్ను పోలీసులు తీసుకుపోతారు. అందరి ద్వారా చేసేది ఆ మహనీయుడే నిండు హృదయంతో వారిని ఆశ్రయించడమే మన కర్తవ్యము.

పెసల సుబ్బరామయ్య

శ్రీ సుబ్బరామయ్య సార్ భౌతికంగా ఉన్నప్పుడు చివరి రోజుల వరకు ఎప్పుడూ తనను భౌతికం గా పూజించడానికి అంగీకరించే వారు కాదు. చివరి రోజులలో 2015 లో ఒక రోజు నగేష్ మరి కొందరు సార్ ను పూజించు కొనుటకు అభ్యర్ధిస్తే సార్ ఒక్కొక్కరు ఒక్కొక్క సారి పూజ అంటే కష్టం గా ఉంటుంది, అందరు కలసి ఒక్కరోజు చేసుకోండి అన్నారు. అది September 5 (టీచర్స్ day) కు చాలా దగ్గరగా ఉండటంతో ఆ శనివారం అందరు కలసి సామూహికంగా గొలగమూడి లో సార్ ను పూజించు కొనుటకు అభ్యర్ధిస్తే సార్ దయతో అంగికరించారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం (సెప్టెంబర్ 5 మరు ఆదివారం, సెప్టెంబర్ second weekend) సార్ గురుపూజ మహోత్సవం గా జరుపుకుంటున్నాము.

**4 వ గురు పాదుకా మహోత్సవ విశేషాలు, సెప్టెంబర్ 9, 2018**


| కార్యక్రమము | వివరాలు | స్మృతులు |
|---|---|---|
| **ఉదయం 5గం:30ని\|\|ల కు అభిషేకం and ఆరతి** | సార్ కు పాలాభిషేకం మరియు ఉదయ ఆరతి జరిగాయి. | |
| **ఉదయం 6గం:30ని\|\| లకు సత్సంగం** | మనకంటే సద్గురువు మనకు శ్రేయస్సు కలిగించాలని ఆత్రుత పడుతుంటారు, పైగా మనకు ఏమి జరిగినా అయన మంచిగా చేస్తారు. అట్టి సద్గురు కృప పొందుటకు మనం చేయవలసినది ఏమిటి ? మొ\|\| |   |

| | | |
|---|---|---|
| | వానిపై భక్తుల అనుభవాలతో సత్ సంగం. వేణు సర్, ప్రసాద్, సాయి, నగేష్, శేషు కృష్ణ మొ \|\| వారు తమ అనుభవాలు పంచుకున్నారు. ఆ సత్సంగ సంభాషణలు అన్ని ప్రక్కన ఉన్న లింక్ లో వినగలరు. |  https://drive.google.com/drive/folders/1DdesBUpualZ3PqV6jom_XekbaOklFQ-9?usp=sharing |
| **ఉదయం 9 గంటలకు సార్ కి పూజ** | శ్రీ గురు పాదుకా స్తోత్రం, శ్రీ గురు గీత తో కూడిన షోడశోపచార పూజ భక్తులందరూ ఎంతో ఉత్సాహం గా చేసుకున్నారు. |   |
| **ఉదయం 10గం:30ని\|\| లకు సార్ కి రుద్రాభిషేకం** | భక్తులందరూ ఎంతో ఉత్సాహం గా బ్రహ్మగారు(పురోహితులు హరిప్రసాద్ గారు) చేయించిన రుద్రాభిషేకం లో పాలు పంచుకున్నారు. శ్రీ సుబ్బరామయ్య సార్ ఆరాధన సందర్భంగా సూర్యుడు దట్టమైన మబ్బు చాటుకి చేరి ఎండ తీవ్రతను తగ్గించారు. |   |
| **మధ్యాహ్నం 12గంటలకు మధ్యాహ్న ఆరతి** | మధ్యాహ్న ఆరతి సమయ లో పాల్గొన్న భక్తులు. | |

| | | |
|---|---|---|
| **మధ్యాహ్నం 12గం:30ని\|\| లకు ప్రసాద వితరణము** | ఈసారి ప్రసాదం ఎవరికి వారే వచ్చి తయారు చేయటం సార్ కృప. |   |
| **మధ్యాహ్నం 2గం\|\|ల నుండి భక్తుల సేవ** | అన్ని సామాన్లు కడిగి, భద్రం చేయటం.<br><br>ముఖ్యంగా చెత్తను ఎవరికీ ఇబ్బంది లేకుండా దూరంగా పారవేయటం. |  |
| **మధ్యాహ్నం 4 గంటలకు సత్ సంగం** | సత్ సంగం లో భక్తులు శ్రీ గురు చరిత్ర గ్రంధము పారాయణ చేసారు. | |



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

| | | |
|---|---|---|
| 1 | అవధూత లీల – (భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి జీవిత చరిత్ర) | 40 రూ॥ |
| 2 | అవధూత లీల (ఇంగ్లీషు) Avadhuta Leela in English | 30 రూ॥ |
| 3 | అవధూత లీల (తమిళం) Avadhuta Leela in Tamil | 50 రూ॥ |
| 4 | అవధూత బోధామృతం - శ్రీ స్వామివారి బోధలు | 15 రూ॥ |
| 5 | శ్రీ స్వామి సన్నిధి – శ్రీ స్వామి వారితో వారి సేవకుల అనుభవాలు | 15 రూ॥ |
| 6 | భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి (ఇంగ్లీషు, చిన్నది) Bhagavan Sri Venkayya Swami(small) | 5 రూ॥ |
| 7 | శ్రీ వెంకయ్యస్వామి (తమిళం, చిన్నది) Sri Venkayya Swami in Tamil (Small Book) | 5 రూ॥ |
| 8 | గురుస్తుతి | 7 రూ॥ |
| 9 | చూచి నేర్చుకో | 8 రూ॥ |
| 10 | శ్రీ మాస్టారుగారి బోధామృతం (నాకు తెలిసిన మాస్టారు(1,2భాగములు)–శ్రీ మాస్టారి మంచిమాట) | 40 రూ॥ |
| 11 | శ్రీ ధునివాలాదాదా చరిత్ర | 15 రూ॥ |
| 12 | శ్రీ శివనేశన్ స్వామీజీ దివ్యచరితము | 12 రూ॥ |
| 13 | శ్రీ బూట్లె రంగప్పబాబుగారి దివ్యచరితము | 8 రూ॥ |
| 14 | శ్రీమాధవదాసుగారి దివ్యచరిత్ర | 4 రూ॥ |
| 15 | శ్రీ పూండీ స్వామి వారి దివ్యచరిత్ర | 15 రూ॥ |
| 16 | శ్రీ యుక్త దర్గాస్వామి వారి దివ్యచరిత్ర | 5 రూ॥ |
| 17 | శ్రీ నరోపా గారి జీవిత చరిత్ర | 2 రూ॥ |
| 18 | వార్తాలాపము | 150 రూ॥ |
| 19 | దైవం మానుష రూపేణ (దర్గాస్వామి చరిత్ర) | 30 రూ॥ |
| 20 | శ్రీ చాంవల్లిబాబా గారి దివ్యలీలలు | 7 రూ॥ |
| 21 | శ్రీ వెంకయ్యస్వామి ఆరతులు | 5 రూ॥ |
| 22. | శ్రీ శ్రీ శ్రీ వల్లి మస్తాన్‌బాబా గారి దివ్యలీలలు | 4 రూ॥ |

## 1 రూపాయి పుస్తకములు

1. శ్రీ వెంకయ్యస్వామి పూజ
2. శ్రీ స్వామివారి భజన పాటలు
3. నమ్మలేని నిప్పు నిజాలు
4. నమ్మనివారికి సొమ్ము - నమ్మకుంటే దుమ్ము
5. స్మృతిమాత్ర ప్రసన్నాయ నమః
6. స్మృతి రహిత ప్రసన్నాయ నమః
7. సర్వ సమర్థుడు
8. వెన్నెలపూలు – శ్రీ వెంకయ్యస్వామి దివ్యత్వం
9. దివ్యలీలలు
10. బోధ యజ్ఞాయనమః
11. ధర్మమూర్తి
12. పిలిచిన పలికే దైవం
13. శ్రీ స్వామికృప
14. మౌనబోధ
15. వాళ్ళు వుండేదాన్ని బట్టి కదయ్యా మనముండేది!
16. స్వామి అనుగ్రహము
17. మాష్టరుగారి సత్సంగము
18. అమృత వాక్కులు
19. మృత్యువుపై భువన విజయము
20. శ్రీ భరద్వాజగారితో భక్తుల అనుభవాలు
21. శుద్ధ చైతన్యమే తానైన పూజ్య శ్రీ భరద్వాజ మాష్టారు గారు
22. శ్రీ మాష్టరు చూపిన సాయి మార్గం
23. శ్రీ దర్గాస్వామి వారి చరిత్ర – 2వ భాగము
24. శివుని ఆజ్ఞ
25. శ్రీ మాయి అమ్మ
26. శ్రీ కృష్ణయ్య స్వామి దివ్య చరిత్ర